
# గుడిశెల రాజకీయం




**మా** కాలనీలో వుండే మిమిక్రీ ఆర్టిస్ట్ మారుతీ ప్రసాద్ సొంతిల్లు కట్టుకుని గృహ ప్రవేశం చేయబోతున్నాడన్న వార్త అశనిపాతంలా తాకింది మమ్మల్ని.

ఆ సాయంత్రం అందరం కాలనీ వేదిక దగ్గర కూర్చుని ఆ విషయమే బరువెక్కిన హృదయాలతో మాట్లాడుకుంటూంటే మారుతీ ప్రసాద్ చిరునవ్వుతో వెలిగిపోతున్న ముఖంతో మా దగ్గర కొచ్చాడు.

“రేపే తెల్లారుఝామున గృహప్రవేశం సార్! మన కాలనీవాళ్ళంతా తప్పకుండా రావాలి!” అన్నాడు అందరికీ తలో ఇన్విటేషన్ కార్డ్ ఇస్తూ.

ఆ ఇన్విటేషన్ కార్డ్ చూస్తూనే మాకందరికీ మాట పడిపోయినంత పనయింది.

“తప్పకుండా వస్తాం” అన్నాం లోపలి ఫీలింగ్స్ బయటకు కనిపించకుండా అణచిపెడుతూ.

అతను వెళ్ళిపోయిన చాలసేపటి వరకు అందరం నిశ్శబ్దంగా వుండిపోయాం.

"అందరూ ఇళ్ళు కట్టుకుంటున్నారు. మనకే.. స్థలం వుండీ– లేకుండా పోయినట్లయింది" అన్నాడు శాయిరామ్.

"లేకపోతే ఈ పాటికి మనందరం కూడా గృహ ప్రవేశాలు చేసి వుండేవాళ్ళం" అన్నాడు రంగారెడ్డి విచారంగా.

ఆ రాత్రి ఆ మారుతీ ప్రసాద్ గృహ ప్రవేశం తాలూకూ ఇన్విటేషన్ కార్డ్ చూసేసరికి కాలనీలో ఆడాళ్ళందరూ సాధింపు ప్రారంభించినట్టు స్పష్టంగా వినిపిస్తూనే వుండి బయటకు.

"ఇంత చేతకాని వాళ్ళు కాబట్టే కొన్న ప్లాట్లను ఆ గుడిశెల వాళ్ళకు అప్పజెప్పి నోర్మూసుక్కూర్చున్నారు" అంటోందొకావిడ.

"మా పుట్టింటి వాళ్ళిచ్చిన డబ్బు మాకు తెచ్చిచ్చేయండి. ఇల్లు కట్టని కాడికి ప్లాటుండేం లాభం?" అంటోందింకో ఆవిడ.

వాళ్ళ సూటీపోటీ మాటలు భరించలేక భోజనాలవగానే అందరం ఇళ్ళల్లో నుంచి బయటపడ్డాం.

"ఎట్లాగయినా మనప్లాట్లు మనం స్వాధీనం చేసుకోవాలి!" అన్నాడు గోపాల్రావ్ ఆవేశంగా. అతనిమాటతో మా అందరికీ కూడా ధైర్యం, ఆవేశం పుట్టుకొచ్చినయ్.

"అవును! అదంతా మన కష్టార్జితం. కనుక వదలడానికి వీల్లేదు" అన్నాడు రంగారెడ్డి.

"కానీ ఎలా స్వాధీనం చేసుకుంటాం! పోలీసులు మనకేమాత్రం సహాయం చేయడం లేదు కదా! పైపెచ్చు గుడిసెలను తీసేస్తామని మన డబ్బుకూడా కొట్టేశారు" అన్నాడు చంద్రకాంత్ అనుమానంగా.

దాంతో మా ఆవేశాలు మళ్ళీ చల్లారిపోయాయ్.

"పోలీసులు సహాయం చేయకపోతే వాళ్ళపై అధికారులకు రిపోర్టిద్దాం" అన్నాడు గోపాల్రావ్.

అతని సూచన మాకందరికీ నచ్చింది.

పోలీస్ అధికారుల్లో కూడా అవినీతివున్నా డైరెక్ట్‌గా వచ్చే కొత్త ఐపీయస్ అధికారులు కనీసం కొంతకాలం వరకయినా చాలా సిన్సియర్‌గా నీతిగా వుంటారని మాకు తెలుసు. అందుకని వాళ్ళను బ్రతిమాలుకుంటే ఫలితం వుండవచ్చని మాకనిపించింది.

మర్నాడే అందరం కలిసి పోలీస్ అధికారులను కలుసుకోవాలని నిర్ణయించుకున్నాం.

"కొంతమంది పోలీస్ అధికారులు నాకు బాగా తెలుసు. వాళ్ళు మామూలు పౌరులకు సహాయం చేయకపోవచ్చుగానీ మా జర్నలిస్ట్‌లకు మంచి సహాయం చేస్తారు" అన్నాడు గోపాల్రావ్.

తీరా మర్నాడు మేం వెళ్ళేసరికి పోలీస్ అధికారులందరూ నక్సలైట్లు పట్టుకున్న ఓ మండలాధికారిని విడిపించే విషయంలో చాలా బిజీగా వున్నారని తెలిసింది.

సాయంత్రం ఆరుగంటలవరకూ వేచి వున్నాక మాకు ఒక పోలీసాఫీసర్ ఇంటర్వ్యూ దొరికింది.

మా సంగతంతా చాలా ఆసక్తిగా విని మా అర్జీ తీసుకున్నాడతను.

"నేను చూస్తాను! మీరింక వెళ్ళిరండి' అన్నాడు చివరలో.

మేము ఆనందంగా తిరిగి వచ్చేశాము.

మర్నాడే పోలీసులువెళ్ళి ఆ గుడిసెలన్నిటినీ పీకేస్తారని మేము అనుకున్నాంగానీ నెలరోజులు అయినా ఏమీ జరగకపోయేసరికి మాకు తిక్కరేగిపోయింది.

అందరం కలిసి మళ్ళీ పోలీస్‌స్టేషన్ కెళ్ళాం.

ఇన్‌స్పెక్టర్ మమ్మల్ని చూసి నవ్వాడు.

"కుదరదయ్యా వాళ్ళ గుడిశెలు తీయడం కుదరదని చెప్పినా వినకుండా మా ఆఫీసర్ దగ్గరకెళ్ళారుకదా! ఆయనేం చేస్తాడు? మాకు చెప్పాల్సిందేగా మళ్ళీ?"

మా ముఖాలు మాడిపోయాయి.

"వాటిని పీకేయడం ఎందుకు కుదరదు? మీకు ఇచ్చిన డబ్బు చాల్లేదా?" కోపంగా అడిగాడు రంగారెడ్డి.

"అది కాదయ్యా! మన రాజధానిలో వుంటూ కూడా గుడిశెల రాజకీయం గురించి మీకు తెలీలేదంటే ఏం చెప్పాలి? మీస్థలాల్లో గుడిశెలు వేయించింది ఎవరోకాదు. ఆ ఏరియా ఎమ్మెల్యే ఆ ఏరియాలో వాళ్ళ పార్టీకి ఓట్లు కొంచెం తక్కువయ్యాయని గుడిశెలేయించి వాళ్ళపార్టీ వాళ్ళను అందులో వుంచారు. కనుక వాళ్ళను కాళీచేయించడం ఎవడివల్లా కాదు–"

మేము గొణుక్కుంటూ ఇళ్ళకు చేరుకున్నాం.

ఆ రాత్రి ఎవరికీ నిద్రపట్టలేదు.

ఆ స్థలాలకు తిలోదకాలు వదులుకోవాల్సి వచ్చిందే అనే బాధ.

తెల్లారుజామున నాలుగ్గంటలకు కాలనీలో గోపాల్రావ్ వుంటున్న వేపు నుంచే పెద్దగా కేక వినిపించేసరికి అందరం అదిరిపడి లేచి కూర్చున్నాం.

మరి కాసేపట్లో బిగ్గరగా మాటలు వినిపించేసరికి వుండబట్టలేక బయటకు నడిచాను. అప్పటికే మా వాళ్ళందరూ నిద్రకళ్ళతో గోపాల్రావ్ చుట్టూ మూగివున్నారు.

గోపాల్రావ్ చాలా ఉత్సాహంగా మాట్లాడుతున్నాడు.

"రాత్రంతా ఆలోచిస్తూనే వున్నాను గురూ! కొశ్చెనాఫ్ అవర్ స్వెట్ అండ్ బ్లడ్ కదా!

ఎలా వదులుకుంటాం? చివరకు మాణింగ్ ఫోరోక్లాక్‌కి అయిడియా వచ్చింది!”

“ఏమిటది?”

“మనందరం కలిసి కోర్టుకెళ్తాం! ఇది అనేకమందికి సంబంధించిన కేస్ కాబట్టి త్వరగా న్యాయం జరగడానికి అవకాశం వుంది. ఇలాంటికేసుల్లో మాంచి స్పెషలిస్ట్ లాయర్ ఒకతను నాకు బాగా తెలుసు. అతని దగ్గరకెళదాం” అన్నాడతను ఉత్సాహంగా.

మాకూ అతని మాటలు ఆశలు కలిగించినయ్.

అప్పటికప్పుడే రెడీ అయి ఉదయం ఆరుగంటకల్లా లాయర్ నరసింహారావ్ ఇంటికి చేరుకున్నాం.

గోపాల్రావ్‌ని చూస్తూనే ఆదరంగా ఆహ్వానించాడతను.

“వీళ్ళంతా మీ కాలనీ వాళ్ళేనా?” అడిగాడతను.

“అవును!”

“గుడ్ ఫెలోస్! పేపర్లో పాపం మీ పాట్లు అప్పుడప్పుడూ చూస్తూనే వుంటాను. ఇంతకూ ఏం పనిమీద వచ్చారు?”

గోపాల్రావ్ జరిగిందంతా చెప్పాడు.

అతనికి మామీద జాలివేసింది.

“దిసీజ్ టూమచ్! మన రాష్ట్రంలోనేకాదు. దేశమంతా కూడా పరిస్థితి ఇలాగే అఘోరించింది. మధ్యతరగతివాడి గురించి పట్టించుకునే నాథుడేలేడు. గవర్నమెంట్ దృష్టిలో ప్రజలంటే మందలుమందలుగా ఓట్లు నివసించే ప్రాంతాలు! అంతే!”

“ఇప్పుడు మనం కోర్టుకెక్కితే వాళ్ళను మా స్థలాల్లోనుంచి ఖాళీ చేయిస్తారంటారా?” ఆశగా అడిగాడు శాయిరామ్.

“ఇంతమందికి అన్యాయం జరిగింది గనుక తప్పక మనకు అనుకూలంగా తీర్పులభించే అవకాశాలున్నాయి”

మా మహజర్లు, డాక్యుమెంట్లు, పోలీస్ కంప్లెయింట్ కాపీలు అన్నీ జతపరచి ఆయనకిచ్చాము.

ఆరునెలల తరువాత మా నరసింహారావు వ్యక్తిగత పలుకుబడివల్ల మా కేసు హియరింగ్ కొచ్చింది. అందరం కోర్టుకెళ్ళి మతగ్రంథాలమీద ప్రమాణాలు చేసి మేజిస్ట్రేట్‌గారికి జరిగిదంతా విన్న వించుకున్నాం.

ఆయనకు మామీద విపరీతమయిన జాలి కలిగింది.

మా జనార్థన్ అద్భుతమయిన నటనతో సహా తను ఎన్నికష్టాలు పడి ఆ స్థలం కొన్నదీ వివరిస్తోంటే మేజిస్ట్రేట్‌గారికి కూడా కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయ్.

ఆ మేజిస్ట్రేట్‌గారు కూడా ఆ మధ్య కొన్న ఓ స్థలంలోకూడా ఎవరో గుడిశెలు వేశారనీ, అందువల్ల ఆయన మా బాధ తేలికగా అర్థం చేసుకోగలిగాడనీ తరువాత చెప్పాడు నరసింహారావు.

ఇంక మాకేసుకి తిరుగులేదనీ, ఆ గుడిశెలవాళ్ళూ చెప్పేదికూడా విన్నాక వాళ్ళను ఆ స్థలాల నుంచి బయటకు గెంటించడం ఖాయమనీ చెప్పాడతను.

మేమందరం ఆనందంగా ఇళ్ళకు వెళ్ళాం.

ఆ తరువాతి వారంలోనే గుడిశెల నాయకులు బోనులో నిలబడ్డారు. మేమంతా శెలవుపెట్టి కోర్టుకి వెళ్ళాం.

"చూడు కిష్టయ్యా! నువ్వూ ఇంకొంతమందీ కలిసి రెండునెలల క్రితం ఇంకొకరి స్థలాల్లో గుడిశెలు కట్టుకున్నారట నిజమేనా?"

"రెన్నెల్లకిందటేడ దొరా! మేమాడ గుడిశెలుగట్టి యాభై ఏండ్లయిపాయే"

మేము మాతోపాటు మా లాయరుకూడా అదిరిపడ్డాం.

"ఏమిటి? మీరా గుడిశెలువేసి యాభైఏళ్ళయిందా?"

"అవ్‌దొరా! ఆ జమానాల నిజాం దొర ఖుద్ ఆ జమీన్ మాకు నజరానా ఇచ్చిండన్నట్లు–"

"అంతా అబద్ధం! వాళ్ళు రెండునెలల క్రితమే గుడిశెలు వేశారు" అరచాడు రంగారెడ్డి.

"ఆర్డర్! మధ్యలో అలా అరిచారంటే బయటకు గెంటిస్తాను" అన్నాడు మేజిస్ట్రేట్ కోపంగా.

మేము రంగారెడ్డిని బలవంతంగా కూర్చోబెట్టేశాము.

"మీరు యాభైఏళ్ళ నుంచీ అక్కడ గుడిశెలు వేసుకుని వున్నట్లు సాక్ష్యాధారాలేమయినా వున్నాయా?"

"సాక్ష్యమేమున్నది దొరా! ఆడుండేటోళ్ళందరూ ఖసంతోటి సాక్ష్యం జెప్పనికి తయారున్నరు–"

రెండు రోజుల్లో రెండువందలమంది బోను ఎక్కి వాళ్ళు ఆస్థలాల్లో యాభైఏళ్ళ నుంచీ గుడిశెలు వేసుకుని వుంటున్నట్లు సాక్ష్యాలు చెప్పారు. ఆఖరులో ఆ ఏరియా ఎమ్మేల్యే కూడా వాళ్ళంతా తరతరాల నుంచీ అక్కడే గుడిశెలు వేసుకుని వున్నట్లు సాక్ష్యం చెప్పాడు.

ఆ రోజు మా లాయర్ మాతో చెప్పేశాడు.

"మన రాజధానిలో ఎక్కడయినా గానీ ఇదే పద్ధతిలో భూముల కబ్జా జరుగుతూంటుంది. గుడిశెలు వేసేస్తారు. వేశాక ఆ స్థలాల ఓనర్లు కాళీ చేయించదానికి కోర్టుకెక్కితే యాభైఏళ్ళ నుంచీ అక్కడే గుడిశెలు వేసుకుని వున్నట్టు వాళ్ళ లేబర్‌తోనే

సాక్ష్యాలు చెప్పిస్తారు. వాళ్ళు కేవలం రెండు నెలల క్రితమే అక్కడకు వచ్చి గుడిశెలు వేసుకుని వున్నట్టు మనం కోర్టులో చెప్తాం. కానీ మనకు ఎవరూ సాక్ష్యం వుండరు కదా! అంచేత కేస్ ఎప్పుడూ వాళ్ళే గెలుస్తుంటారు–"

ఆ తరువాత మరో రెండు నెలల్లో జడ్జిమెంట్ వచ్చింది.

"వాళ్ళు యాభై సంవత్సరాల నుంచీ ఆ స్థలాల్లో గుడిశెలు వేసుకుని వున్నట్టు సాక్షాధారాలతో ఋజువు కావటం వల్ల కేస్ కొట్టివేయడమైనది."

"ఇదన్యాయం!" అంటూ ఆవేశంగా అరిచాడు యాదగిరి.

అతనిని వెంటనే పోలీసులు బయటకు తోసేశారు.

మేమంతా దిగాలుపడి కోర్టు ఆవరణలోనే వున్న ఓ కాంటీన్లో 'టీ' తాగుతోంటే ఆ గుడిశెలు వేయించిన పాండూ దాదా మా దగ్గర కొచ్చాడు.

"ఏం తంబీ? ఏమాయే? సుధరాయించిన్రా లేక బడే కోర్ట్‌ల ఠకరాయిస్తరా?" అన్నాడు ఎగతాళిగా.

మాకు రక్తం ఉడికిపోయింది కానీ మధ్యతరగతి వాళ్ళం గనుక నోర్మూసుకుని వుండిపోయాం.

"ఏయ్– ఇదీ గరిబోండ్ల రాజ్యంబే! మేమేం జేస్తే గదే కానూన్ అవుతది! మేమేం జేప్తే గదే ప్రభుత్వం జేస్తది. మేమెవళ్ళకు ఓట్లేస్తే వాండ్లే రాజ్యం జేస్తరు. సమజైందా?" హేళనగా అడిగాడు.

మేము ఇళ్ళకు తిరిగి వచ్చేశాము. అంతకుముందు కేవలం మా కష్టార్జితమైన ఆ ఇళ్ళస్థలాలు పోయాయన్న బాధ ఒక్కటే వుండేది.

ఇప్పుడు దానికి తోడు ఆ దాదాగాడు మమ్మల్ని అతిదారుణంగా ఫూల్స్‌ని చేయడం మరింత బాధ కలిగిస్తోంది. చదువులేనివాడు విద్యావంతుల్ని ఫూల్స్ చేయడమే మనదేశంలో డెమొక్రసీ!

ఇంట్లో టీవీ కార్యక్రమాలు మామూలు ప్రకారం ప్రజల్ని చీల్చి చెండాడుతున్నయ్! మరికాసేపటి తరువాత హోమియోపతి డాక్టర్‌తో ఇంటర్వ్యూ ప్రారంభమైంది. మామూలుగానే డాక్టర్ నేమీ మాట్లాడనివ్వకుండా అన్నీ మాట్లాడేస్తున్నాడు ఇంటర్వ్యూ చేసే వ్యక్తి.

డాక్టర్ మధ్యలో జొరబడడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు గానీ ఆ వ్యక్తి అతనికే మాత్రం సందు దొరకనీయడం లేదు. ఆఖరులో ఆ వ్యక్తికి హఠాత్తుగా దగ్గు రావడం వల్ల ఆ సమయాన్ని డాక్టర్ ఛటుక్కున దొరకబుచ్చుకుని తను చెప్పదల్చుకున్న నాలుగు మాటలు శరవేగంతో చెప్పేశాడు.

“హోమియోపతి ప్రకృతి సహజమైన అతి ముఖ్యమైన ప్రిన్సిపుల్ మీద పనిచేస్తోంది. ముఖ్యంగా మన ప్రాచీన భారత వైద్య శాస్త్రానికి హోమియోపతి వైద్యం ఎంతో దగ్గరగా ఉంది. ఉదాహరణకు ‘ఉష్ణం ఉష్ణేన శీతలం’ అనేది మన ప్రాచీన వైద్య విధానానికి చెందిన సూత్రం. హోమియోపతి కూడా అదే సిద్ధాంతం ప్రకారం పని చేస్తుంది. అందుకే హోమియోపతి మందులు ముందు రోగి జబ్బుని మరింత పెంచి అప్పుడు దానిని తగ్గించేందుకు చర్య ప్రారంభిస్తుంది–”

నాకు ఆ మాటల్లో ఏదో గొప్ప మెసేజ్ కనిపించింది.

ఆ రూల్ మా ప్లాట్స్ గొడవకు కూడా వర్తిస్తుందనిపించింది.

అంటే అన్యాయాన్ని అన్యాయంతోనే ఎదుర్కోవాలి! అక్రమాన్ని అక్రమాలతోనే ఎదుర్కోవాలి! గుండాయిజాన్ని గూండాయిజంతోనే ఎదుర్కోవాలి.

అంతేకానీ తెల్లారి లేస్తే ఆ గూండాల దయాదాక్షిణ్యాల మీద బ్రతికే పోలీస్ సహాయం కోరగూడదు. ఎదుటిమనిషి ఎంత పెద్దమనిషి అన్న విషయం వదిలేసి వాడు తెచ్చుకున్న సాక్ష్యాధారాలకు విలువిచ్చే కోర్టుల సహాయం తీసుకోకూడదు.

ఉదయం లేస్తూనే ఆవేశంగా వెళ్ళి శాయిరామ్‌ని నిద్రలేపాను.

“వెంటనే మన వాళ్ళందర్నీ పిల్చుకురా! రాత్రి నాకు బ్రహ్మాండమైన అయిడియా వచ్చింది. మన ప్లాట్స్‌లోనుంచి ఆ గుడిశెల వాళ్ళను ఒక్కరోజులో లేపేద్దాం–” అన్నాను.

పావుగంటలో అందరూ వేదిక దగ్గర గుమిగూడి పోయారు. నేను చాలా గర్వంగా నా ప్లాన్ వాళ్ళకు చెప్పాడు.

“మనం చేయాల్సింది చాలా సింపుల్! శంకర్‌దాదా దగ్గరకెళ్ళి ఎంతోకొంత రేటు మాట్లాడి డబ్బు ఇచ్చేశామంటే మన ప్లాట్స్‌లోనుంచి వాళ్ళందరినీ దెబ్బకు ఖాళీ చేయిస్తాడు శంకర్‌దాదా!”

అందరికీ ఆ ఆలోచన నచ్చింది.

నిజానికి గూండాయిజాన్ని ప్రోత్సహించడం మాలో ఎవరికీ ఇష్టం లేదు కానీ మేము కష్టార్జితానికి నీళ్ళు వదులుకోకుండా వుండాలంటే అంతకంటే గత్యంతరం లేదు.

అప్పటికప్పుడే తలో వెయ్యి రూపాయిలూ పోగుచేసి, ఆ మొత్తం తీసుకుని శంకర్‌దాదా ఇంటికి చేరుకున్నాం. అప్పటికి టైమ్ పదవుతోంది.

అప్పుడే గుండంబాతో మొఖం కడుగుతున్నాడు శంకర్‌దాదా.

మమ్మల్ని చూసి ఆశ్చర్యపోయాడు.

“ఏమ్ సంగతి– చాల్దినాలకొచ్చిన్రు” అన్నాడు మొఖం కడగగా మిగిలిన ద్రావకం త్రాగేస్తూ.

సంగతంతా చెప్పామతనికి.

కొద్దిక్షణాలు ఆలోచనలో పడ్డాడు శంకర్‌దాదా.

"ఆ ఏరియా దాదా ఎవరు? పాండూ దాదానా?" అడిగాడు మమ్మల్ని.

"అవున్సార్"

"గట్లనా? ఆడయితే కొంచెం కిరికిరి కొడుకే" మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

"మీరెంత డబ్బంటే అంత ఇచ్చేస్తాం సార్!" అన్నాడు రంగారెడ్డి ఆ మాటతో శంకర్‌దాదా మొఖంలోకి కళ వచ్చేసింది.

"అగో చెప్పక పోతిరి మల్ల! ఇంకా మీ కేస్‌లో ఫుకట్‌గా పని జేయాలన్‌కుంటున్న! పైసలెద్తే కిరికిరే మున్నదివయ్యా? నిమిషాల్ల ఖాళీ జేయ్‌పిస్త! సమజయిందా?"

"అయింది సార్!"

"ఎన్ని పైసలు తెచ్చిన్రు?"

"పదివేల్సార్"

"పదివేలా? పదివేలకు గిసంటి ఖతర్‌నాక్ పనులెవళ్ళు జేస్తార్వయ్యా! పదిహేను వేలయినగాని వుండాలె!"

మేము మారు మాట్లాడకుండా పదిహేనువేల రూపాయలు అతని చేతిలో పెట్టాము.

అతను మావేపు ఆప్యాయంగా చూశాడు.

"ఇగో– ఇంక ఇండ్లకు పోయి ఫికరుండండి! రేపీ టైమ్‌కల్లా మీ జాగాలన్నీ ఖాళీ అయిపోతై సమజయిందా?"

"అయిందిసార్" అన్నాడు యాదగిరి.

"అయితే ఇకపోండ్రి"

మేమంతా కాలనీ కొచ్చేశాము.

మర్నాడు ఉదయం మేము ప్లాట్స్ దగ్గరకెళ్ళేసరికి సగం గుడిశెలు కనిపించడంలేదు.

అయితే మిగతా సగం ఇంకా ఉండటం ఇబ్బందికరంగా అనిపించి మళ్ళీ శంకర్‌దాదా దగ్గరకెళ్ళాం. ఆ టైమ్‌లో గుడంబాతో స్నానం చేస్తున్నాడతను.

"ఏమాయే? ఖాళీ జేసిన్రుగదా ఆళ్ళు–" అడిగాడతను గుడంబా నెత్తినబోసుకుంటూ.

"సగం మందే చేశారు సార్"

"మిగతా వాళ్ళు ఆ ఏరియా ఎమ్మేల్యే గ్యాంగ్‌రాభయ్! నేను పోయి ఎమ్మేల్యేను బ్రతిమిలాడితేగానీ పోరు–"

"ఒక్కసారి అయన్తో మాట్లాడండి సార్"




"మాట్లాడిన లాభంలేదురాభయ్! ఆడసలే పైసల్‌కోసం గడ్డితినేటైప్- కనీసం ఓ పదివేలైనా వానికియ్యకపోతే ఒప్పుకోడు."

గత్యంతరం లేక శంకర్‌దాదాకి ఇంకో పదివేలిచ్చాం.

"మంచిది బిడ్డా! నేనిప్పుడే ఎమ్మేల్యేతానకు బోయి- సెటిల్‌జేస్తా-" అన్నాడతను.

రెండోరోజు ఉదయానికి పూర్తిగా గుడిశెలన్నీ ఆనవాల్లేకుండా లేచిపోయినయ్.

పోలీసుల వల్లా, కోర్టుల వల్లా కాని పని కేవలం గూండావల్ల అయిందంటే నిజంగా మన రాష్ట్రం ఎంత అభివృద్ధి చెందిందో, మన రాష్ట్ర ప్రభుత్వం ఎంత ఉన్నత స్థితిలో వుందో, మనరాష్ట్ర ప్రజలు ఎంత అదృష్టవంతులో- మాకు అర్థమయింది. తిన్నగా అందరం శంకర్‌దాదా ఇంటికి చేరుకున్నాం.

"మళ్ళీ వచ్చిన్రేమి సంగతి? ఇంకెవళ్ళయినా ఖాళీ చేయకుండ మిగిలిన్రా?" అడిగాడతను.

"లేద్సార్! అన్ని గుడిశెలూ లేచిపోయాయ్! మీ రుణం ఎలా తీర్చుకోవాలో తెలీడం లేదు" అన్నాడు రంగారెడ్డి.

"అరె- నీ యవ్వ- దాన్దేమున్నది భాయ్! ఒక జాగాల వున్నోళ్ళం! మంచిగ ఒకరి గురించి ఒకళ్ళు సహాయం చేసుకోవాలె! ఏం జెపున్నా! గట్లనే జరవచ్చే ఎలక్షన్ల గురించి గూడా ఖ్యాల్ తోటుండండి! నేనే ఎంపీగా ఈ ఏరియాకి నిలబడుతున్నా-"

అందరం అతనికే ఓట్లువేస్తామని ప్రామిస్ చేసి అక్కడి నుంచి మా కాలనీ వైపు బయలుదేరాం ఆనందంగా. దాదాలూ, మర్డరర్లూ, గాంగ్‌లీడర్లూ, ఎంపీలుగా, ఎమ్మేల్యేలుగా ఎందుకు ఎన్నికౌతున్నారో అప్పుడే తెల్సింది మాకు.